



బాధ్యతలు చేపడుతున్న ఎస్‌కెయు విసి



జెఎన్‌టియు విసికి శుభాకాంక్షలు చెబుతున్న దృశ్యం

ఎస్‌కెయు, జెఎన్‌టియు వీసీలు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - అనంతపురం

ఎస్‌కెయు, జెఎన్‌టియు ఇన్‌ఛార్జి వీసీలు శుక్రవారం తమ బాధ్యతలు స్వీకరించారు. ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరబ్ ఉత్తర్వులు మేరకు శ్రీకష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి ఉపకులపతిగా ఎంబీఏ విభాగానికి చెందిన ఆచార్య బి. అనిత బాధ్యతలు స్వీకరించారు. అదే విధంగా జెఎన్‌టియు ఇన్‌ఛార్జి ఉపకులపతిగా ఆచార్య హెచ్.సుదర్శన రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్కేయు వీసీగా నియమితులైన ఆచార్య అనిత విశ్వవిద్యాలయంలో 1989వ సంవత్సరంలో నియమితులయ్యారు. 1998 లో అసోసియేట్ ప్రొఫెసర్‌గాను, 2006 నుండి ప్రొఫెసర్‌గానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ సిబ్బంది, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు,బోధన, బోధ నేతర సిబ్బంది, పరిశోధన విద్యార్థులు, అకాడమిక్ కన్సల్టెంట్లు, అన్ని సెక్షన్లకు సంబంధించిన సిబ్బంది ఆచార్య అనితకి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య జి వెంకట నాయుడు, రిజిస్ట్రార్ ఆచార్య ఎంవి. లక్ష్మయ్య, పిఆర్‌ఒ ఆచార్య కే రామగోపాల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా అనంతపురం జేఎన్టీయూ ఇన్‌ఛార్జి ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య హెచ్.సుదర్శన రావుకు శుక్రవారం అనంతపురం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆచార్య నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రములో ఉపాధ్యక్షులు ఆచార్య కె.విజయలక్ష్మి, కార్యదర్శి శారదా, జాయింట్ సెక్రటరీ ఎపి.శివకుమార్, ట్రెజరర్ ఆచార్య విష్ణువర్ధన్ రెడ్డి, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన ఎస్‌ఎస్ ట్యాంకుల్లోకి తాగునీటి పంపింగ్

కలెక్టర్‌ను ఆదేశించిన ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి - ఉరవకొండ

ఉరవకొండ నియోజకవర్గంలోని ఎస్ఎస్ ట్యాంకుల్లోకి తాగునీటి పంపింగ్‌ను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌ను రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విజయవాడ నుంచి అనంతపురం జిల్లా కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వల్ల ఉరవకొండ ప్రాంతంలోని ఎస్ఎస్ ట్యాంకులు పూర్తిగా ఎండిపోయాయని, దీంతో తాగునీటి విషయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని మంత్రి అన్నారు. ఈ నేపథ్యంలో ఈసారి తుంగభద్ర జలాశయానికి ఆశించిన స్థాయిలో నీరు వచ్చాయని దీంతో హెచ్ఎల్‌సికి తుంగభద్ర జలాలు విడుదలవుతున్న వేళ ఉరవకొండ నియోజకవర్గంలోని నింబగల్లు, విడపనకల్లు, గడేకల్, కొనకొండ్ల గ్రామాల వద్ద ఉన్న ఎస్ఎస్ ట్యాంకులను తుంగభద్ర జలాలతో నింపే ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన చేపట్టేలా ఆర్డబ్ల్యూఎస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని కలెక్టర్‌కు మంత్రి సూచించారు. తాగునీటి విషయంలో ప్రజలు ఇన్నాళ్లు పడిన ఇబ్బందులను పూర్తిగా తీర్చే చర్యలను వేగవంతం చేయాలని మంత్రి కలెక్టర్‌ను ఆదేశించారు. ఆ దిశగా ఆర్‌డబ్ల్యూఎస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ట్యాంకులకు, ఫిల్టర్ బెడ్‌లకు నీటి పంపింగ్ చర్యలను తాను స్వయంగా పర్యవేక్షిస్తానని జిల్లా కలెక్టర్ మంత్రికి వివరించారు.

పూర్వ కమ్యూనిస్టుల ఉద్యమాలే స్ఫూర్తి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు



పూర్వ కమ్యూనిస్టుల కుటుంబాల సమ్మేళనంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి గతంలో కమ్యూనిస్టులు, ఉద్యమకారుల పోరాటాల గడ్డ అని పూర్వ కమ్యూనిస్టుల పోరాటాలను, ఉద్యమాలే స్ఫూర్తి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి విమానాశ్రయం ఎదురుగా గల సిపిఎం కార్మిక కర్షక భవనంలో పూర్వ కమ్యూనిస్టుల కుటుంబాల సమ్మేళన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బడాసుబ్బిరెడ్డి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ రావు హాజరవగా, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ , జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, సీనియర్ నాయకులు ఓబులు, ఈఎస్ వెంకటేష్, దిల్షాద్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అమరవీరుల కుటుంబాల సభ్యులతో మాట్లాడి వారిని కలుసుకోవడం ఎంతో ఆనందకరంగా ఉందన్నారు. ఆనాడు అమరవీరుల త్యాగఫలమే ఈనాడు ఎర్రజెండా రెపరెపలాడుతోందని అన్నారు. బ్రిటిష్ కాలంలో కమ్యూనిస్టులను ఎక్కడివారిని అక్కడ ఉద్యమాలు చేయకుండా నడిరోడ్డుపై కాల్చే వారని, లేదా నిర్బంధించే వారని చెప్పారు. అలాంటి తరుణంలో కూడా ప్రాణాలను పణంగా పెట్టి ఉద్యమంలో పాల్గొన్న వారికి జోహార్లు అర్పిస్తున్నామన్నారు. శ్రీ సత్య సాయి జిల్లా గడ్డపై ఎంతోమంది ఉద్యమకారులు పుట్టారని వారిలో ముఖ్యంగా గణేనాయక్, బుక్కపట్నం నాగమ్మ, సి ముత్యాలప్ప, మలసాని గంగులప్ప, కామ్రేడ్ హిమాంసాబ్, ఇలా ఎంతో మంది ఉద్యమ నాయకులకు ఇది పుట్టినిల్లు అని అన్నారు. వీరు ఎలాంటి స్వార్థం లేకుండా ప్రజాసేవకే అంకితమై జీవించారని చెప్పారు. నేటి యువతరానికి ఓబులు, రాంభూపాల్, ఇంతియాజ్ తదితరులు విద్యార్థి నాయకులుగా ఉన్నప్పుడు నుండి ఉద్యమం ముందుకు తీసుకువెళ్లడానికి, కార్మిక, కర్షకులకు అండగా ఉంటూ ఎన్నో పోరాటాలు చేస్తూ నేటి ఉద్యమానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారని తెలిపారు. కార్మికులకు, కర్షకులకు న్యాయం జరగాలంటే సిపిఎం అధికారంలోకి రావాలన్నారు. అందుకు పెత్తందారులు, పెట్టుబడి దారి వ్యవస్థ అడ్డుకుంటున్నారని, వారు చేస్తున్న సంస్కరణలకు ఇతర పార్టీలు సైతం వత్తాసు పలుకుతూ రాజకీయాలను డబ్బుతో ముడి పెడుతున్నాయని విమర్శించారు. ఇటీవల సామాన్యుల రక్త మాంసాలు పిండి ఒక పెట్టుబడిదారీ వ్యవస్థకు చెందిన వ్యక్తి తన కొడుకు పెళ్లి కోసం వేలకోట్ల రూపాయలు ఖర్చు చేశారని అది ప్రజాధనమేనని తెలిపారు. కేంద్రంలో బిజెపి విజయం సాధించినా వారి ముఖాల్లో విజయానందం లేదన్నారు. వారు గెలిచిన తక్కువ సీట్లు సాధించి ఓడిన వారితో సమానమేనని తెలిపారు. తక్షణ ప్రయోజనాల కోసం మోడీ ప్రభుత్వంతో జత కట్టిన ప్రతి ప్రాంతీయ పార్టీ సైతం మట్టికొట్టుకుపోయిందని కేంద్రం చెప్పిన ప్రతి మాటను విన్నందునే వారికి ఆ గతి పట్టిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్టు, స్మార్ట్ మీటర్లు తదితర అంశాల ద్వారా రైతుల ఆగ్రహానికి గురి అయిందని, దాంతో తెలుగుదేశానికి పట్టం కట్టారని చెప్పారు. నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం ప్రత్యేక హోదా, కడప, విశాఖ ఉక్కు గురించి కేంద్రం వద్ద నోరు తెరచలేదని విమర్శించారు. ప్రాంతీయ పార్టీలు ఓడిపోవడం ఎంత అనివార్యమో కమ్యూనిస్టులు రావడం అంతే అవసరమని తెలిపారు. కమ్యూనిస్టులు ఎప్పుడూ పదవులు కోరేవారు కాదని ప్రజల హక్కులు ఇతరులు హరించకుండా పోరాటాలు చేస్తుంటారని తిరిగి మళ్లీ కమ్యూనిస్టు పార్టీలు అధికారంలోకి వస్తే ప్రజలకు మంచి రోజులు వస్తాయని తెలిపారు. అనంతరం సిపిఎం సీనియర్ నాయకులు ఓబులు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఆధునిక కాలంలో పెత్తందారీ విధానం నిర్మూలించడం కోసం కమ్యూనిస్టు భావాలతో ఎంతోమంది పోరాటాల్లో ప్రాణాలర్పించారని, మరికొంతమంది జైలు పాలయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జడ్పీ శ్రీనివాసులు, జివిఎల్ నరసింహులు, లక్ష్మీనారాయణ, జంగాలపల్లి పెద్దన్న, సాంబశివ, ప్రవీణ్, పెనుగొండ పెద్దన్న, హరి, పైపల్లి గంగాధర్, బ్యాల అంజి, సిఐటియు బాబావలి ముత్యాలప్ప, మడకశిర శ్రీదేవి, సోమందేపల్లి శ్రీదేవి, సౌభాగ్య, సిపిఎం నాయకులు, పూర్వ కమ్యూనిస్టుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి పనుల వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

అర్హత గల ప్రతి కుటుంబానికి వంద రోజుల 'ఉపాధి'

జిల్లా కలెక్టర్ టిఎస్. చేతన్

ప్రజాశక్తి- చిలమత్తూరు

అర్హత గల ప్రతి కుటుంబానికి కనీస వేతనంతో వంద రోజులు ఉపాధి పనులు కల్పించాలని జిల్లా కలెక్టర్ టి. ఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మండల పరిధిలోని టేకులోడులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన పేదలందరికీ జాబ్ కార్డులు మంజూరు చేసి పని కల్పించడం జరుగుతుందని అన్నారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు మెరుగైన జీవనోపాధి కల్పించే విధంగా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. పనిచేసే ప్రాంతంలో కూలీలకు ప్రభుత్వ నియమ నిబంధన ప్రకారం అన్ని వసతులు ఉండేటట్లు చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మూడు నెలల తర్వాత క్షేత్రస్థాయిలో తన పర్యటన ఇక్కడ ఉంటుందని అప్పటికి ఆహ్లాద కరమైన వాతావరణంలో చెట్లు ఉండాలని చెప్పారు. కూలీలతో మాట్లాడుతూ చేసిన పనికి వారం రోజులు లోపు వ్యక్తిగత ఖాతాల్లోకి నగదు జమ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రామ్‌కుమార్, ఎపిడిఒ శివానందనాయక్, అప్పస్వామి నాయుడు, ఉపాధి సిబ్బంది, సంబందిత అధికారులు, కూలీలు పాల్గొన్నారు.

గోరంట్ల : మండలంలోని సింగిరెడ్డిపల్లి చెరువు నుంచి రావికుంటకు నీరు సరఫరా అయ్యే కాలువ పనులను ఉపాధి హామీ కింద చేపట్టారు. కూలీలు పనులు చేస్తుండగా శుక్రవారం కలెక్టర్ చేతన్ పరిశీలించారు. కలెక్టర్ కూలీలతో మాట్లాడుతూ ఉపాధి బిల్లులు సక్రమంగా అందుతున్నాయా అని ఆరా తీశారు. అలాగే వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సప్లై ఛానల్ పనులు రూ.4.44 లక్షలతో జరుగుతున్నాయని ఉపాధి హామీ సిబ్బంది కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం కలెక్టర్ గోరంట్లకు చెందిన రైతు రామకృష్ణ రెండున్నర ఎకరాల్లో సాగు చేస్తున్న మామిడి తోటను పరిశీలించారు. కలెక్టర్ వెంట డ్వామా పిడి విజయప్రసాద్, ఏపీఓ వరప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్లు ఉన్నారు.

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-హిందూపురం



సమావేశంలో మాట్లాడుతున్న డిఎల్‌డిఒ సమతా రెడ్డి

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ విధులను చిత్తశుద్ధితో నిర్వహించాలని సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన పురపాలక సంఘంతో పాటు లేపాక్షి, చిలమత్తూరు మండలాలకు చెందిన వార్డు, గ్రామ అడ్మిన్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ సెక్రటరీలతో సమీక్ష, సమావేశం నిర్వహించారు. నోడల్ అధికారి శివారెడ్డి, డిఎల్‌డిఒ సమతారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు రోజుకు మూడుసార్లు హాజరును నమోదు చేయాలన్నారు. ఆధార్ క్యాంపెనింగ్ నిర్వహించి ఆధార్ లేని వారికి, ఆధార్ కేవైసీ చేపట్టాలన్నారు. పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ఏ సచివాలయ పరిధిలో ఎక్కువగా నమోదైతే ఆయా సెక్రటరీలపై చర్యలు తప్పవని, కావున వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సచివాలయాల్లో అందుబాటులో లేని సెక్రటరీలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయాల్లో ప్రజలకు అందే సేవలన్నింటినీ అందించాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒలు వెంకటేశ్వరరెడ్డి, గుప్తా, రామ్‌కుమార్, ఈఒఆర్‌డి నటరాజ్, గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందజేత

పరిగి : మండలంలోని నేతలపల్లి ఎంపిపిఎస్ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం హిందూపురం పట్టణా నికి చెందిన ఈశ్వర్ జ్యువెలర్స్ వ్యవస్థాపకులు శ్రీహర్ష, శ్రీవర్ష దంపతులు యూనిఫారం దుస్తులు అందజేశారు. వారి కుమార్తె శ్రీఆధ్య తరపున 58 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేసి నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంఇఒలు లక్ష్మీదేవి, శేషాచలం మాట్లాడుతూ మంచి స్థాయిలో ఉన్న ప్రతిఒక్కరూ నిరుపేదల విద్యాభివృద్ధికి తమ వంతు సాయం అందించాలని, ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని సేవాదృక్పథం అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం మహంతేష్, శాసనకోట పాఠశాల హెచ్ఎం ఆనందరాజు, ఉపాధ్యాయురాలు హేమలత, కళావతి పాల్గొన్నారు.



గాలి 'వాటా'లకు పితలాటకం

తల పట్టుకుంటున్న గాలిమరల సంస్థ ప్రతినిధులు

సహజ వనరుల దోపిడీకీ పోటీనే..

తెలుగు తమ్ముళ్ల బరితెగింపు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గాలి మరల్లో వాటాలకై ఇద్దరు ముఖ్య నేతల మధ్య పోటాపోటీ కొనసాగుతున్నట్టు గుసగసలు వినిపిస్తున్నాయి. అనంతపురం జల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న నియోజకవర్గంలో గాలిమరల వాటా పేచీ కొనసాగుతోంది. అదే విధంగా ఆ నియోజకవర్గంలో సహజ వనరుల దోపిడీ కూడా పోటాపోటీగా సాగుతోంది. గాలి వాటాల కోసం ఇద్దరు ముఖ్య నేతలు పోటీపడుతున్నారు. దీంతో ఏమి చేయాలో పాలుపోని పరిస్థితి గాలిమరల సంస్థ ప్రతినిధుల్లో నెలకొంది. ఆ నియోజకవర్గం పరిధిలో పెద్దఎత్తున గాలి మరలున్నాయి. సుమారు 150 ఉన్నట్టు సమాచారం. అయితే అందులో 45 వరకు మాత్రమే పనిచేస్తున్నట్టు తెలుస్తోంది. పనిచేసే వాటి వరకు అక్కడ పనిచేసే సిబ్బందిని స్థానిక నేతలు సిఫారసు చేసిన వారికి ఇవ్వడానికి అవకాశమున్నట్టు సంస్థ ప్రతినిధులు ముఖ్య నేతను ఒకరిని కలిశారు. ఇందులో పలుకుబడిన ఉన్న మరో నేతలకు రెండు భాగాలు, స్థానిక నేతకు ఒక భాగం కింద సూచించారు. అయితే తనకే కావాలని స్థానిక నేత పట్టుబట్టడంతో వారికే ఇవ్వాలని అంగీకరించారు. సరిగ్గా ఇదే సమయంలో మరో నేత తన వాటా కూడా ఇవ్వాల్సి ఉంటుందని సంస్థ నేతలను కోరినట్టు తెలుస్తోంది. దీంతో ఇదేమి పంచాయతీ అని సంస్థ ప్రతినిధులు తల పట్టుకుంటున్నారు. వీరే కాకుండా ఇతర అధికారపార్టీ నేతలు కూడా తమకూ వాటా కావాలని కోరుతున్నట్టు చర్చ నడుస్తోంది. ఇది ఇలాగుంటే మట్టి, ఇసుక తవ్వకాల్లోనూ ఈ నియోజకవర్గంలో నేతల మధ్యపోటీ కొనసాగుతోంది. అనంతపురం జిల్లా సరిహద్దుల్లోనున్న ఒక పెద్ద కొండను తవ్వడానికి కొత్తగా ఎన్నికైక ప్రజాప్రతినిధి సమీప బంధువు ఒకరు ప్రొక్లైన్, ఐదు టిప్పర్లతో వెళ్లారు. అయితే తానేమి తక్కువ అంటూ మరో నాయకుడు కూడా తాను ప్రొక్లైన్, తొమ్మిది టిప్పర్లతో కొండ వద్దకు చేరుకున్నట్టు తెలుస్తోంది. దీంతో ఇద్దరి మధ్య మరో పేచీ కొనసాగింది. ఒకరికొకరు పోటీ పడటంతో ఇద్దరు కూడా తవ్వకుండా మిన్నకున్నారు. ఇలా అధికారపార్టీలో నేతల మధ్య సహజవనరుల దోపిడీపై పోటీ కొనసాగుతోంది. వీరు ఇసుక, మట్టి తవ్వకాలపై కన్నేసారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముందు నుంచి ఈ నియోజకవర్గంలో టిడిపి నాయకుల మధ్య విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. వాటిని సమన్వయపరిచేందుకు కమిటీలు వేసినా ఫలితం లేకపోయింది. ఇటువంటి పరిస్థితుల్లోనూ పార్టీ గెలుపొందింది. గెలిచిన తరువాత కూడా ముఖ్య నాయకులు, కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధి మధ్య విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. వారి తోడ్పాటు లేకుండానే తాను గెలుపొందానని వారి మాటలు వినే పరిస్థితి లేదన్నట్టుగా ప్రజాప్రతినిధి వ్యవహార శైలి ఉంటోందని పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. ఇప్పుడు పనుల విషయంలోనూ నువ్వా..నేనా అన్నట్టుగానే ఆ నియోజకవర్గంలో వ్యవహారం నడుస్తోంది. ఇవి ఇప్పటికి బహిర్గతం కాకపోయినప్పటికీ లోలోపల మాత్రం రెండు గ్రూపుల మధ్య అంతర్గత తగాదాలు కొనసాగుతూ ఉండటం గమనార్హం.

అభివృద్ధి పనులకు కేంద్రమంత్రికి ప్రతిపాదనలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్. రాజు

నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టడానికి రూ. 500 కోట్లతో కేంద్ర మంత్రి సోమ న్నకి ప్రతిపాదనలు పంపామని ఎమ్మెల్యే ఎంఎస్. రాజు తెలిపారు. పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో శుక్రవారం ఆయన మాజీ ఎమ్మెల్సీ గుండు మల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా చెక్ డ్యాంలు, చెరువుల మరమ్మతులు, తదితర వాటిపై కేంద్రమంత్రి సోమన్నతో చర్చించి ప్రతిపాదనలు పంపామన్నారు. ఏ గ్రామంలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తెస్తే వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, నిధుల సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ముఖ్యంగా రైతులు ఎదుర్కొంటున్న ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యను పరిష్కరించాలన్నారు. వేరుశనగ, అంతర పంటల సాగు, పట్టు పరిశ్రమపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

వీరాస్వామికి ఐకాన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు

ప్రజాశక్తి-కదిరి టౌన్



వీరాస్వామి

పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో సీనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న డాక్టర్ వేముల వీరాస్వామి ప్రతిష్టాత్మక ఐకాన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు-2024కు ఎంపికయ్యారు. దేశ వ్యాప్తంగా వివిధ రంగాల్లో అసాధారణ వ్యక్తులు, వారి విజయాలను గుర్తిస్తూ ప్రఖ్యాత రిఫాసిమెంటో ఇంటర్నేషనల్, న్యూ ఢిల్లీ సంస్థ ఐకాన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు-2024 ప్రదానం చేస్తుంది. సాంకేతిక విద్యా రంగంలో డాక్టర్ వేముల వీరాస్వామి కనబరుస్తున్న ప్రతిభ, అంకితభావం, అచంచలమైన స్ఫూర్తికి గుర్తింపుగా ఈ అవార్డుకి ఎంపిక చేశామని ఆ సంస్థ ఎడిటోరియల్ బోర్డు సంపాదకులు రవిభూషణ్ తెలిపారు. డాక్టర్ వీరాస్వామిని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది అభినందించారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు 'హరీష్' విద్యార్థులు



ప్రతిభా విద్యార్థులతో పాఠశాల నిర్వాహకులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

రూరల్ పరిధిలోని ఎరుకలవాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి 46వ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎంఎస్.కిరణ్ తెలిపారు. ఎం.చరణ్‌కుమార్‌రెడ్డి(పదో తరగతి), వై.సింధు, జాహ్నవి, దేవిక, షాలిని(9వ తరగతి), కె.శైలజ (8తరగతి)జిల్లా జట్టుకు ఎంపికయ్యారని, వీరు ఆగష్టు 16, 17 తేదీల్లో కదిరిలోని ఎస్‌టిఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే జూనియర్ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులను, వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసన్నకుమార్, ఖాదర్‌వలిలను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు. క్రీడాకారులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మహిళల ధర్నా

ప్రజాశక్తి - కొత్తచెరువు



సబ్‌స్టేషన్ ఎదుట మహిళల ఆందోళన

ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇళ్లలో ఎలక్ట్రి కల్ వస్తువులు పాడైపోయా యని శుక్రవారం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద మహిళలు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ స్థానిక బీసీ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడంతో విద్యుత్ సరఫరాలో హై వోల్టేజీ కారణంగా పలు ఇళ్లలో టీవీలు, ఫ్రిజ్‌లు, ఇతర ఎలక్ట్రికల్ వస్తువులు పూర్తిగా కాలిపోయాయన్నారు. ఈ విషయం పలుమార్లు విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. కాలనీలో ఒకే ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ఓవర్ లోడ్ కారణంగా పలుమార్లు ఇళ్లలోని ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోయాయన్నారు. తక్షణమే కాలనీలో మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం లైన్‌మేన్ యుగంధర్‌కి వినతిపత్రం అందజేశారు. లైన్‌మేన్ మాట్లాడుతూ కొత్తచెరువు మేజర్ పంచాయతీలో 20 ట్రాన్స్‌ఫార్మర్లు ఉండాల్సి ఉండగా 12 మాత్రమే ఉన్నాయని, ఇంకా 8 ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలపై ఉద్యమించాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం ఇంతియాజ్ పిలుపునిచ్చారు. అలాగే ప్రజా సంఘాలను బలోపేతం చేయాలని కోరారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో శుక్రవారం ఓబులు, ఇంతియాజ్ సమక్షంలో 8 మంది సిపిఐ ముఖ్య నాయకులు సిపిఎం అనుబంధ ప్రజా సంఘాల్లో చేరారు. వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఆంజనేయులు, ఎం.గంగాధర్, ట్రెజరర్ పి.వెంకటేష్, సహాయ కార్యదర్శి వెంకట రమణ, మండల కార్యదర్శి మగ్గం చంద్ర, కృష్ణ. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెవి. రమణ, మహిళా సంఘం జిల్లా కౌన్సిల్ మెంబర్ లక్ష్మీదేవి ఉన్నారు. ఓబులు మాట్లాడుతూ గతంలో ఇక్కడ పని చేసిన వారు మళ్లీ సొంత గూటికి చేరుకోవడం మంచి పరిణామం అన్నారు. చేరిన నాయకులు మాట్లాడుతూ సిపిఎం, అనుబంధ ప్రజాసంఘాలు చేస్తున్న పోరాటాలకు ఆకర్శితులై సంఘాల్లో చేరామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.పెద్దన్న, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, ఎం.ఇంతియాజ్

పరిశ్రమల స్థాపనతోనే అభివృద్ధి :కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పరిశ్రమల స్థాపనతోనే జిల్లా అభివృద్ధి చెందుతుందని, కావున ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి జిల్లా అభివృద్ధికి కషి చేయాలని కలెక్టర్ టిఎస్ చేతన్ ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లో ఏపీఐఐసి, పరిశ్రమలు, చేనేత జౌళి, పర్యాటక శాఖల అధికారులతో ప్రస్తుతం జిల్లాలో ఆయా శాఖల ద్వారా జరుగుతున్న ప్రగతి, అభివృద్ధి పనులపై సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి నిబంధన మేరకు ఔత్సాహికులను ప్రోత్సహించాలని సూచించారు. పర్యాటక ప్రదేశాలను అన్ని విధాలా తీర్చిదిద్దాలన్నారు. పర్యాటక రంగం అభివృద్ధితో పాటు ఆదాయ మార్గాలపై దృష్టి పెట్టాలన్నారు. అధికారులు పనితీరు మెరుగు పరుచుకోవాలని, అభివృద్ధి పనులకు సంబంధించి నివేదికలు అందజేయాలన్నారు. సమావేశంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోనీ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా, చేనేత జౌళి శాఖ అధికారి రమేష్, పర్యాటక శాఖ అధికారి జయకుమార్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్ చేతన్

ప్రజలకు జవాబుదారీగా పనిచేద్దాం : ఎమ్మెల్యే సింధూర

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

నియోజకవర్గ అభివృద్దే మనందరి లక్ష్యమని, ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా ప్రజలకు జవాబుదారీగా పనిచేద్దామని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం డ్వామా పిడి విజయేంద్రప్రసాద్ అధ్యక్షతన నియోజకవర్గంలో ఉపాధి హామీ పనులపై ఆ శాఖ క్షేత్ర స్థాయి అధికారులు, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డితో కలిసి ఆమె సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేద కూలీలకు వరం అని, ఇందులో అవినీతికి తావులేకుండా పారదర్శకంగా పనులు చేపట్టి ప్రజలకు సేవ చేయాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడేలా శాశ్వత అభివృద్ధి పనులు కల్పించేలా అధికారులు ఆయా పంచాయతీల వారీగా ప్రణాళికలు తయారు చేసుకొని ఎక్కువ మంది కూలీలకు పని కల్పించాలన్నారు. పల్లె రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో 'ఉపాధి' చట్టాన్ని అవినీతి మయం చేసి నిధులను పక్కదారి పట్టించారని మండిపడ్డారు. అధికారులు చిత్తశుద్ధితో ప్రజలకు జవాబుదారీగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. సమావేశంలో డ్వామా పిడి విజయేంద్రప్రసాద్, ఏపీడీలు, ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే, మాజీ మంత్రి

జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వి.రత్నను శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. వారు ఎస్పీకి పుష్పగుచ్చం అందించి శాలువాతో సన్మానించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, తదితర అంశాలపై వారు చర్చించారు. ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డికి ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జిల్లా అడిషనల్ ఎస్పీ విష్ణువర్ధన్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి, పల్లె రఘునాథ్ రెడ్డి

నిడిమామిడి అమ్మ ఆలయంలో పూజలు

నిడిమామిడమ్మ ఉట్ల జాతరకు ఎమ్మెల్యే సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వారికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు వీరభద్రస్వామిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి నిడిమామిడి అమ్మ గ్రామదేవత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట నాయకులు విజయ్ కుమార్, నాగరాజు, అక్రంబాషా, వీరభద్ర, రామయ్య, నారాయణస్వామి, పెద్దప్పయ్య, జగన్, రామంజి ఉన్నారు.

పకడ్బందీగా కుల ధ్రువీకరణ పత్రాల తనిఖీ

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని వివిధ గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది చేపట్టిన కుల ధ్రువీకరణ పత్రాల తనిఖీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తహశీల్దార్ శివశంకర్ నాయక్ ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది తప్పులకు తావులేకుండా క్యాస్ట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను చాలా జాగ్రత్తగా చేపట్టాలన్నారు. ఈ ప్రక్రియలోనే ప్రజల నుంచి అందే వినతులను స్వీకరించి మార్పులు చేయాలని సూచించారు. సీసీఆర్సీ(కౌలు రైతు కార్డు)లను 45 మందికి గానూ 22 మందికి ఇచ్చామని, మిగిలిన వాటిపై విచారణ పూర్తి చేయాలన్నారు. రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను సకాలంలో ఇవ్వాలన్నారు. లేట్ బర్త్, డెత్ సర్టిఫికెట్లపై సమగ్రంగా విచారించి గడువులోగా కార్యాలయానికి పంపాలన్నారు. ఇసుక రీచ్‌లో పొరపాట్లకు తావులేకుండా నిబంధనల మేరకు ప్రజలకు ఇసుక అందజేయాలన్నారు. సమావేశంలో కార్యాలయ సిబ్బంది, సర్వేయర్లు తదితరులు ఉన్నారు.

రెండు, మూడు రోజులు భారీ వర్షాలు

రానున్న రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ శివశంకర్‌నాయక్ సూచించారు. తహశీల్దార్ విలేకరులతో మాట్లాడుతూ ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు, పాత భవనాలు, పూరిగుడిసెల్లో ఉన్నవారు సమీపంలోని ప్రభుత్వ భవనాలు, బంధువుల ఇళ్లలో ఉండాలని కోరారు. గ్రామ రెవెన్యూ అధికారులు, సహాయకులు వారి వారి గ్రామాల పరిధిలో ఉంటూ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.


షోరూంను ప్రారంభించిన ఎమ్మెల్యే సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి

వైభవ్ సిల్క్ షోరూం ప్రారంభం

కొత్తచెరువు : స్థానిక ధర్మవరం రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వైభవ్ సిల్క్ షోరూంను శుక్రవారం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ప్రారంభించారు. కొత్తచెరువు, పుట్టపర్తి, బుక్కపట్నం మండలాల ప్రజలకు ఈ సిల్క్ షోరూం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. 50 శాతం తగ్గింపు ధరకు వస్త్రాలు విక్రయిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ వాణి, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, మాజీ జడ్పిటిసి లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచి మాణిక్యం బాబా, నాయకులు లక్ష్మీనారా యణ, శివప్రసాద్, నాగేంద్ర, రమేష్, రవి, కేశప్ప, తదితరులు పాల్గొన్నారు.

'ఐచర్' అసోసియేషన్ కార్యాలయం ఏర్పాటు

ప్రజాశక్తి-బత్తలపల్లి

బత్తలపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐచర్ వాహనాల అసోసియేషన్ కార్యాలయాన్ని శుక్రవారం ముఖ్యఅతిథిగా హాజరైన ఎఎస్ఐ తిరుపాలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ట్రాన్స్ పోర్ట్ రంగం చాలా బాధ్యతతో కూడుకున్నదని, వాహన యజమానులు, డ్రైవర్లు సమిష్టిగా పని చేయా లన్నారు. డ్రైవర్లు తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం తాగి వాహనం నడపొద్ద న్నారు. చంద్రమోహన్, వెంకటేష్, బిల్లే శంకర్ మాట్లాడుతూ వాహనాలకు ఆల్ ఇండియా పర్మిట్ కల్గి ఉండాలన్నారు. మొదట స్థానికులకు అవకాశం కల్పిస్తామని, వారు లేనిచో ఇతర ప్రాంతాల వారిని పిలుస్తామన్నారు. అనంతరం అసోషియేషన్ మండల అధ్యక్షులుగా పుల్లయ్య, ఉపాధ్యక్షులుగా రమేష్, ట్రెజరర్‌గా సురేష్, సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఐచర్ వాహనాల యజమానులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎఎస్ఐ తిరుపాలు

మృతుని కుటుంబానికి 'నిమ్మల' పరామర్శ

గోరంట్ల రూరల్ : మండలంలోని మందలపల్లి గ్రామా నికి చెందిన కిషోర్ గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకు న్న మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప ఆ గ్రామం వెళ్లి కిషోర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంత్యక్రియలకు ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు నిర్మల చంద్రశేఖర్, గోపాల్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, రఘునాథరెడ్డి, కన్నారెడ్డి, వెంకటశివ, నరసింహులు, శంకర్ ఉన్నారు.

తొగటవీర క్షత్రియ సేవా సమితి ఎన్నిక

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక శ్రీలక్ష్మీవెంకటేశ్వర కళ్యాణ మండపంలో శుక్రవారం మాజీ సర్పంచ్ డిసి.ఈశ్వరయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో తొగటవీర క్షత్రియ సేవా సమితి అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సేవా సమితి అధ్యక్షుడిగా సిసి.హరి, ఉపాధ్యక్షులుగా పామిశెట్టి గోపి, పోలా శ్రీనివాసులు, దాసర రామంజి, సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా గట్టా మహేంద్ర, సహాయ కార్యదర్శిగా రంగన గోపాల్, కోశాధికారిగా డిసి.మంజు, ప్రచారకర్తగా నాగేంద్ర, మీడియా కోఆర్డినేటర్లుగా జగదీష్, రామాంజి, మనోహర్, తదితర సభ్యులను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు సిసి.హరి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా తొగట వీర క్షత్రియ సామాజిక వర్గం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. సమావేశంలో జడ్పిటిసి డిసి అశోక్, ఎంపీటీసీ పూజారి ఈశ్వరయ్య, కుర్లపల్లి వెంకటరాముడు, షీలా నారాయణస్వామి, పూజారి శంకర, గూడూరు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

'డయల్ యువర్ డిఎం'కు వినతులు

పుట్టపర్తి క్రైమ్ : స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం డిపో మేనేజర్ ఇనాయతుల్లా 'డయల్ యువర్ డిఎం' కార్యక్రమం నిర్వహించగా పలు వినతులు అందాయి. డిఎం మాట్లాడుతూ ప్రధానంగా శ్రీశైలంకు బస్సు ఏర్పాటు చేయాలని, పుట్టపర్తి–చెన్నై(చిత్తూరు మీదుగా) బస్సును పునరుద్ధరించాలని, పుట్టపర్తి నుంచి పులివెందుల, కడప, గుంతకల్లు, కసాపురం, కదిరికి బస్సులు నడపాలని వినతులు అందాయన్నారు. ఆయా విజ్ఞప్తులను పరిశీలించి ఉన్నతాధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని వారికి తెలిపారు.

లేపాక్షిలో ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-లేపాక్షి

స్పెయిన్ దేశానికి చెందిన శిక్షకులు శుక్రవారం స్థానిక క్రీడా మైదానంలో ఫుట్ బాల్ శిక్షణ శిబిరం నిర్వహించారు. శిక్షకులు ముందుగా మండలంలోని ఫుట్ బాల్ క్రీడాకారుల(బాల, బాలికలు)కు ఫుట్‌బాల్ క్రీడలో మెలకువలను వివరించారు. శిక్షకులు మాట్లాడుతూ పిల్లలతో మమేకమై క్రీడల అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. మండల ఫుట్‌బాల్ అసోసియేషన్ అభివృద్ధికి ఆర్‌డిటి సహాయ సహకారా లు ఎప్పుడూ ఉంటాయని ఈగల్ క్లబ్ కోఆర్డినేటర్ జాకబ్, ఐన, ఇలియానా, అలెక్స్, జార్జ్ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ మండల అధ్యక్షులు గిరిధర్, పిడి రామాంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పిల్లలకు శిక్షణ ఇస్తున్న స్పెయిన్ దేశానికి చెందిన శిక్షకులు

కెజిబివి పరిశీలన

గాండ్లపెంట : మండలంలోని కటారుపల్లి క్రాస్ వద్ద ఉన్న కెజిబివిని శుక్రవారం వైద్యాధికారి మహేశ్వర్‌మారుతి సందర్శించి పాఠశాలలో పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. వంటగది, టాయిలెట్లు, పరిసరాల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఒ దుర్గ, వైద్య సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా ఇళ్లు : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించి ఇవ్వాలని, ఇల్లు లేని పేదవారు ఎవరూ ఉండకూడదని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సూచించారు. పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో శుక్రవారం మంత్రి గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గం లో గత ఐదేళ్లలో గృహ నిర్మాణ శాఖలో జరిగిన అభివృద్ధి కార్యకలాపాలపై మంత్రి సమీక్షించారు. ఇళ్ల విషయంలో అవినీతికి పాల్పడితే ఉపేక్షించమని హెచ్చరించారు. సమావేశంలో హౌసింగ్ పిడి వెంకటనారాయణ, డిఈ శివకుమార్, ఏఈలు శ్రీనాథ్, గణేష్, పాల్గొన్నారు.

ఉచిత డీఎస్సీ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోండి

ఉచిత డీఎస్సీ కోచింగ్‌ను పరీక్షకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సవిత సూచించారు. మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా ఉచిత వసతి, భోజన సదుపాయంతో పాటు డీఎస్సీ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. పేదల కడుపు కొట్టేలా వైసిపి ప్రభుత్వం మూసేసిన అన్న క్యాంటీన్లను రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 15వ తేదీ ప్రారంభిస్తామన్నారు. ప్రజలకు భారంగా మారిన ఇసుకను ఉచితంగా అందిస్తున్నామన్నారు. పెనుకొండ కొండపై ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో 108 అడుగుల శ్రీలక్ష్మీనరసింహ స్వామి భారీ విగ్రహ ఏర్పాటు పనులు త్వరలోనే ప్రారంభిస్తామని, పెనుకొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.


గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి సవిత

వారం లోపు దరఖాస్తు చేసుకోండి : జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి

200 మందికి శిక్షణ ఇస్తామని టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు వారంలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి నిర్మల జ్యోతి తెలిపారు. వివరాలకు 08554–275575లో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏబిసిడబ్ల్యు గంగాధర్, టిడిపి నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, త్రివేంద్ర, డివి.ఆంజనేయులు పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి : ఎమ్మెల్యే రాజు



మండల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, అధికారులు

ప్రజాశక్తి-అమరాపురం

అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించగా ఎమ్మెల్యే ఎంఎస్.రాజు హాజరై మాట్లాడారు. రైతులు వేరుశనగ సాగు చేసి నష్టాలు చవిచూస్తున్నారని, కావున ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రతి గ్రామ సచివాలయంలో వారంలో ఒక రోజు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి వ్యవసాయం రంగంలో మార్పులపై ప్రజలకు తెలియజేయాలన్నారు. రాజకీయ ఒత్తిళ్లు లేకుండా ఉద్యోగులకు అన్ని విధాలా అండగా ఉంటానని తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు, ఎంపిడిఒ భాస్కర్, మండల అధికారులు, జడ్పీటీసీ స్వరక్క, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు

ఎమ్మెల్యేకి వెలుగు సిబ్బంది సన్మానం

స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం తిప్పన్న సమక్షంలో మండల సమైక్య తరపున ఎమ్మెల్యే ఎంఎస్.రాజును మహిళా సంఘాల సభ్యులు సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే రుణాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గణేష్, ప్రధాన కార్యదర్శి జయరామప్ప, నాయకులు నరసింహామూర్తి, శివ రుద్రప్ప, జయకుమార్, విశ్వేశ్వరప్ప, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అవినీతిపై ప్రత్యేక అధికారితో విచారణ : మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి కథనానికి స్పందన

హిందూపురం : పురపాలక సంఘంలో అకౌంట్స్ సెక్షన్‌లో జరిగిన అవినీతిపై ప్రత్యేక అధికారితో విచారణ చేస్తామని కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. పురపాలక సంఘంలోని అకౌంట్స్ సెక్షన్‌లో జరిగిన అవినీతిపై శుక్రవారం ప్రజాశక్తిలో 'కమిషన్ ఇచ్చుకో.... చెక్కులు పుచ్చుకో' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ సమస్యను పురపాలక శాఖ ప్రాంతీయ సంచాలకులకు వివరించారు. ఆయన ఆదేశాల మేరకు కార్యాలయంలోని కొందరు అధికారులపై వచ్చిన ఆరోపణలపై ప్రత్యేక అధికారితో విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. అవినీతి ఆరోపణలు రుజువైతే పురపాలక శాఖ నిబంధనల మేరకు వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

బకాయి బిల్లులను క్లియర్ చేయండి

పురపాలక సంఘంలోని అకౌంట్స్ విభాగం నుంచి ప్రీ ఆడిట్ కోసం పంపే ప్రతి ఫైలును త్వరతగితిన క్లియర్ చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి ప్రీ ఎడిట్ అధికారులను కోరారు. కమిషనర్ తన ఛాంబర్‌లో ప్రీ ఆడిట్ అధికారులతో సమావేశం నిర్వహించి ఇప్పటికే సిఎఫ్ఎంఎస్‌లో నమోదు చేసిన పెండింగ్ బిల్లులపై చర్చించారు. గుత్తేదారుల బిల్లులు పెండింగ్ ఉండడంతో అభివృద్ధి పనులు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదని, దీంతో పాటు అత్యవసర పనులు, వేతనాలకు సంబంధించిన వాటిని త్వరగా ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


ప్రీ ఆడిట్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

సీజనల్ వ్యాధులపై అవగాహన

పుట్టపర్తి రూరల్ : కుష్టు వ్యాధిపై సర్వే, అవగాహన, మాతా శిశు సంరక్షణ, అతిసార నియంత్రణ, సీజనల్ వ్యాదులపై శుక్రవారం పుట్టపర్తి పిహెచ్‌సి వైద్య నిపుణులు బత్తలపల్లి గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు కుష్టు వ్యాధి లక్షణాలు, వ్యాప్తి, నివారణపై అవగాహన కల్పించారు. కుష్టు వ్యాధిపై ఆశా కార్యకర్తలు నిర్వహించే ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. అంగనవాడీ కేంద్రంలో పిల్లలు, గర్భిణులకు అందించే పౌష్టికాహారం, పరిసరాల పరిశుభ్రత, అతిసార వ్యాధి లక్షణాలు, చికిత్సను వివరించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, సత్యమ్మ, అంగనవాడీ టీచర్ ప్రవళ్లిక, ఆశా కార్యకర్త లక్ష్మీదేవి పాల్గొన్నారు.

కొనసాగిన న్యాయవాదుల రిలేదీక్షలు

కదిరి టౌన్ : న్యాయవాది రామస్వామి నాయుడుపై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని న్యాయవాదులు చేపట్టిన రిలే నిరా హార దీక్షలు 4వ రోజైన శుక్రవారం కూడా కొనసాగాయి. వారు మాట్లాడుతూ జూన్ 28వ తేదీ న్యాయవాదిపై కొందరు గూండాలు దాడికి పాల్పడ్డారని ఫిర్యాదు చేసినా పోలీసులు నిందితులను అరెస్టు చేయకపోవడం దారుణ మన్నారు. న్యాయవాదులకే ఇలాంటి పరిస్థితి వస్తే సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. పోలీసులు వెంటనే నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల దీక్షకు వివిధ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

గ్రామ దేవతలకు జ్యోతుల ఉత్సవం

రొద్దం : తొలి ఏకాదశి సందర్భంగా మండలంలోని నారనాగేపల్లి గ్రామంలో శుక్రవారం గ్రామదేవతులైన ముత్యాలమ్మ, సప్పలమ్మలకు గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జ్యోతులు సమర్పించారు. ముందుగా మహిళలు జ్యోతులు నెత్తిన ఎత్తుకోగా, రైతులు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాగభూషణ, మనోహర్, లింగప్ప, నాగిరెడ్డి, గోవిందు, ధనంజి, సుబ్బు, సంజీవ, సోము పాల్గొన్నారు.

రేపు జెవివి ప్లీనరీ

హిందూపురం : పట్టణంలోని ఎన్ఎస్‌పిఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం జన విజ్ఞాన వేదిక ప్లీనరీ సమావేశం నిర్వహిస్తున్నట్లు జెవివి ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఈటి రామ్మూర్తి శుక్రవారం తెలిపారు. ప్లీనరీ సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ, జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్, జిల్లా అధ్యక్షులు మహేంద్ర రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆదిశేషు హాజరవుతారన్నారు. డాక్టర్ గేయానంద్ 'సైన్స్ సామాజిక సమస్యలను పరిష్కరిస్తుందా' అంశంపై విద్యార్థులతో చర్చాగోష్టిలో పాల్గొంటారన్నారు. సదస్సులో గత కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి, భవిష్యత్ కార్యక్రమాలపై చర్చ జరుగుతుందన్నారు. జోనల్ కమిటీలో మార్పులు, చేర్పులు ఉంటాయన్నారు.

'డిగ్రీ కళాశాల నిధులు ఏమయ్యాయి'?

కదిరి టౌన్ : పట్టణంలోని ఎస్‌టిఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిధులు ఏమయ్యాయో ప్రిన్సిపల్ సమాధానం చెప్పాలని విద్యార్థి సంఘాల నాయకులు నరసింహ, ఉపేంద్ర, అరుణ్ డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు గత ఐదేళ్లలో ఎన్నో నిధులు వచ్చినా భవనాల మరమ్మతులు, అభివృద్ధి పనులు చేయకుండా ప్రిన్సిపల్ స్మిత గాలికి వదిలేశారని ఆరోపించా రు. దీనిపై ప్రశ్నించిన విద్యార్థి సంఘాల నాయకులపై కేసులు పెడతామని బెదిరింపులకు పాల్పడుతు న్నారని మండిపడ్డారు. వీటిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని, లేనిచో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పృథ్వీరాజ్, అవినాష్, జన, భార్గవ్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ పట్టణ సుందరీకరణకు శ్రీకారం

పెనుకొండ : పట్టణ సుందరీకరణకు మంత్రి సవిత శ్రీకారం చుట్టారని టిడిపి పట్టణ కన్వీనర్ శ్రీరాములు పేర్కొన్నారు. స్థానిక అంబేద్కర్ కూడలి నుంచి ఎన్టీఆర్ కూడలి వరకూ రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌లో మొక్కల పెంపకానికి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు పాలించిన పెనుకొండ పర్యాటకంగా అభివృద్ధి చెందుతోందన్నారు. వైసిపి ప్రభుత్వంలో పెనుకొండలో అభివృద్ధి పడకేసిందన్నారు. దీంతో మంత్రి పెనుకొండ అభివృద్ధిపై దష్టి సారించారన్నారు. డివైడర్ల మధ్య మొక్కలు, సెంటర్ లైటింగ్ ఏర్పాటుకు మంత్రి చొరవ చూపారన్నారు. ఆయన వెంట మాజీ వైస్ సర్పంచి సుబ్బి, ఆంద్రూస్, తదితరులు ఉన్నారు.

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోండి

బత్తలపల్లి : తపాలా శాఖ(పోస్టల్)లో అమలవుతున్న వివిధ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బత్తలపల్లి పోస్టుమాస్టర్ కమ్మన్న సూచించారు. పోస్టల్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం బత్తలపల్లిలో పోస్టల్ పథకాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మరిన్ని వివరాలకు పోస్టాఫీసులో సంప్రదించాలని సూచించారు. ర్యాలీలో ఎంఒ బుద్రన్న, ప్రకాష్, వెంకటనారాయణ, పోస్టల్ ఏజెంట్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త మృతికి 'పల్లె' నివాళి

నల్లచెరువు : మండలంలోని కుమ్మరవాండ్లపల్లి గ్రామంలో శుక్రవారం టిడిపి సీనియర్ నాయకుడు కౌలేపల్లి రామస్వామి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆ గ్రామం వెళ్లి రామస్వామి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ తరపున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట నాయకులు రమణారెడ్డి, సతీష్, కరుణాకర్, నాగిరెడ్డి, ఎల్లప్ప, రాజు కుమార్, శంకర్ ఉన్నారు.

హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

రాష్ట్రవ్యాప్తంగా హాస్టల్ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు, కాస్మోటిక్ ఛార్జీలను వెంటనే విడుదల చేయాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో శుక్రవారం ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విలేకరులతో మాట్లాడుతూ జులై 20 నుంచి 30 తేదీ వరకూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ హాస్టళ్లను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటామన్నారు. వాటి పరిష్కారం కోసం ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. మూతబడిన హాస్టళ్లను వెంటనే తెరవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్‌రెడ్డి, నాయకులు సాయిగౌతమ్, దేవరాజు, ప్రసాద్, మదన్, అభినాష్, చరణ్ పాల్గొన్నారు.